# ద్విపద

పుస్తకంనుండి తలెత్తాను. ఎదురుగా అతను కనుపించాడు. ఎంత వయస్సుంటుందో స్పష్టంగా తెలీదు. గడ్డం బాగా పెరిగివున్నది. గుడ్డలు అట్టలుకట్టి మురికివాసన వేస్తున్నవి. కళ్లు కుళ్ళిన టొమాటోకాయ ల్లాగున బురబురలాడుతున్నాయి. అతనిపక్కనే కుర్రవా డొకడు వున్నాడు. బహుశా ఐ దా రేళ్ళ వయస్సుండవచ్చు. మెళ్ళో పాలపూసలదండ. రెండు చిల్లికానీలు మొలతాడులో కట్టుకొని వున్నాడు. పిల్లవాడి వొంటి నిండా మట్టి చారలుచారలుగా వుంది. జుట్టు గుబురుగా, రాగివర్ణంలో పెరిగివుంది. పెద్దతను దణ్ణంపెట్టాడు. నాకు చిరాకేసింది.

“ఇక్కడేమీలేదు, వెళ్ళు. మా బతుకులే అంతంతమాత్రంగా వున్నాయి. ఈ పార్కులో నాకంటే లక్షాధికారులు చాలామందివున్నారు. వెళ్ళి ప్రాధేయపడు. వాళ్లేమన్నా సహాయం చెయ్యగలరు—ఉన్నవాళ్లు గనుక” అన్నాను. తిరిగీ “ఆకలి పాటలు” పుస్తకం విప్పుతూ.

“అదిగాదండీ...”

మళ్ళీ తలెత్తాను.

“రెండు రోజులనుండీ అన్నం తినలేదండీ...” ఇంకా ఏదో చెప్ప బోతున్నాడు అతను. నాకు అసహ్యమేసింది నామీదే.

“అదృష్టవంతుడివి నువ్వు. లేదని గట్టిగా చెప్పుకోగలుగుతున్నావు. నాకా హక్కుకూడా లేదు. నా అభిమానం ఆ హక్కును తొలగించి వేసింది. ఉదయంనుండీ కాఫీ లేదు. మధ్యాహ్నంనుండీ సిగరెట్టులేదు. మూడు రోజులనుండీ మందులేదు. పదకొండు రోజులనుండీ చొక్కాలేదు. నా బాధలు ఎవరితో చెప్పుకోనేది ?”

నే నన్నమాటలు అర్థం చేసుకోవటానికి పిద్ధంగాలేనట్టు కనిపించాడు నాకు. అతని కళ్ళలోనుండి నీళ్లు జొటజొట పచ్చని గడ్డిమీదపడి చిందాయి. పిల్లవాడు అతని చెయ్యిబట్టుకు లాగుతూ—“నాన్నా! నాన్నా!! అమ్మను చూపించు నాన్నా. నాకు అమ్మకావాలి నాన్నా. అమ్మదగ్గిరికి పోదాం రా నాన్నా” అని ఏడుస్తున్నాడు.

నాకు చప్పున మా గోపీ జ్ఞాపకంవొచ్చాడు. అరగంట ఆలస్యమయితే మావాడు గూడా అమ్మకోసమని ఇట్లాగే గోలచేస్తాడు నన్ను. అతను

కొడుకును దగ్గరకుదీసుకొని కౌగలించుకొన్నాడు. చొక్కాతో, కొడుకు కళ్లల్లో నీళ్ళు తుడిచాడు. తనూ తుడుచుకొన్నాడు.

"నాకు తెలుసు మీరు పడుతున్న బాధలు" అన్నాడు అతను నావేపు చూస్తూ. "ఒకప్పుడు నేనూ మీలాగా గుమాస్తానే! యాభై రూపాయలిచ్చేవారు. వాటితోనే సంసారం గడుపుకొస్తుండేవాణ్ని. మా సావిత్రి–వీడితల్లే లెండి—నా అదృష్టంకొద్దీ దొరికింది. ఉత్తమురాలు. ఆ డబ్బుతోనే అన్ని ఖర్చులూ సరిపెట్టుతూండేది. ఇన్నిటికీ భగవంతుడు నాయందు దయ తప్పాడు. నేను జబ్బుపడ్డాను. మూడు నెలలు మంచంలో కాలు, కింద పెట్టలేదు. ఉద్యోగం పోయింది. నానాబాధలూ పడ్డాము. తిండికీ గుడ్డకూ ముఖంవాచాము. ఇంటోవున్న సామానంతా అమ్మాము. ఆఖరికి మా సావిత్రి తాలిబొట్టుగూడా అమ్మక తప్పిందికాదు. నా జబ్బు కాస్త వెనక్కి మళ్లింది. కర్ర బట్టుకొని వీధిలోకీ ఇంట్లోకి తిరుగుతున్నాను. మరో వారం పదిరోజుల్లో ఇంకెక్కడన్నా ఉద్యోగం వెతుక్కుందా మనుకుంటున్నాను. అంతలోకే..." అని ఆపి అతడు బావురుమని ఏడిచాడు.

నాకు జాలేసింది అతన్ని చూస్తే. అందరం ఒకేజాతికి చెందినవాళ్లం. ఒకే బాధలు, ఒకే జీవితం, ఒకే సంఘర్షణ బ్రతుకుతోటి. ఆ తర్వాత జీవిత మేమిటో నేను వినదలచుకోలేదు. వెలుతురు స్పర్శనైనా ఎరుగని చీకటి దొంతరలు. వానచినుకైనా రాలని ఎడారి. గొంతు సరిచేసుకొని తిరిగి అతను ప్రారంభించాడు.

"...అంతలోకే కలరామారి మా వూళ్ళో ప్రవేశించింది. సావిత్రి గూడా రెండురోజులు తీసుకొని మూడోనాడు చనిపోయింది. ఈపిల్లవాణ్ని తీసికొని, "నా" అనే దిక్కులేని ఆ వూరు వొదిలి ఇట్లా దేశంమీద బయలు దేరాను. నాకు జీవించాలనే ఆశలేదు. ఆ ఆశ సావిత్రి మరణంతోబాటే మరణించింది. సావిత్రిలేని ఈ ప్రపంచంలో నేను బ్రతుకలేను. సావిత్రి నన్ను తల్లిగా, సోదరిగా, ప్రియురాలుగా, స్నేహితురాలుగా అనునయించింది. ఇంక ఎందుకు నన్నీ ప్రాణాలు విడిచిపోవో నా కర్థంకావటంలేదు. అనేకసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించాను..."

నేను వణికాను. జీవించటం కోసం మృత్యువుతో ఘోరాతిఘోరంగా పోరాడవలసిన మానవుడు; మృత్యువుకోసం, జీవితంతో కుస్తీ పడుతున్నాడు. ఎంత హేయం ?

"ప్రయత్నించాను. చావటానికి నా కభ్యంతరంలేదు. కానీ చచ్చి? చచ్చిన తరవాత ఈ కుర్రవాడి గతేమిటి? వీ ణ్నెవరుచూస్తారు? ఒకటి రెండు సార్లు వీణ్ని ముందు చంపి, తరువాత నేను చనిపోదామని ప్రయత్నించాను. కానీ! కన్నకడుపును చేజేతులా చంపటానికి ప్రాణంవొప్పలేదు. భగవంతుని మీద భారంవేసి అట్లాగే రోజులు దొర్లిస్తున్నాను. ఇప్పటికి రెండురోజుల నుండీ వీడికి కడుపునిండా తిండిలేదు. నా సంగతి సరేసరి. "కడుపు నిండటం" అనే మాట ఏదో కలలోకేకలాగా వినిపిస్తున్నది...అందులో వీడు తల్లికోసం వొకటే ఏడుపుఏడుస్తున్నాడు. తల్లినుండి వేరుజేసి, తనను బాధిస్తున్నానని వీడి అభిప్రాయంగావును. నన్ను నమ్మడు. తనతల్లి చని పోయిందని వీడి కర్థంగాదు. మృత్యువునుగురించి, వీడి కర్థమయ్యేటట్లు ఎట్లాచెప్పాలో నాకు తెలీటంలేదు...పోనీండి లేకపోతే! అంతగా బాధ పడకండి. ఇంకోరిని అడగ్గలను"

అతను మెల్లగా వెనక్కుతిరిగాడు. నా మనస్సు చిదురుచిదు రయింది. మొదట దురుసుగామాట్లాడినందుకు నొచ్చుకున్నాను. వెనక్కు పిలిచాను. మందుకోసం కూడబెడుతున్న డబ్బులలో, అంతవరకూ పోగైన రూపాయి పధ్నాలుగణాలూ అతని కిచ్చాను. అంతకంటే ఎక్కువ ఇవ్వ లేనందుకు విచారిస్తున్నా నన్నాను. అతనికళ్ళు ఆనందంతో మెరిశాయి. మ్లానంగా నవ్వాడు. తను నమస్కరించాడు. కొడుకుతో నమస్కరింపించాడు.

## 2

"ఫోవేం?" అని మాఆవిడ గర్జించింది. నేను ఉలిక్కిపడి లేచాను. కానీ లేవలేదు. కళ్లువిప్పాను. శరీరమంతా నెత్తురుముద్దలాగా వున్నది. నెత్తురు జిమ్మ్మజిమ్మ్మమని పీకుతున్నది. ఆరురోజులూ, కుర్చీలో తాపడమై పోయిన శరీరం, ఈ రోజునైనా మంచంలోవుండాలని శాసిస్తున్నది. మధ్యా న్నం మూడుగంటలైవుంటుంది. లేచి వొళ్ళువిరుచుకొని తిరిగి పడుకొ న్నాను. నిద్ర పట్టలేదు. కానీ నిద్రకు, జాగ్రదావస్థకూ మధ్యగల విచిత్ర మైనస్థితి న న్నావరించింది. బైట జరుగుతున్న ప్రతి పనితాలూకూ ధ్వనులూ నాకు వినిపిస్తూనే వున్నాయి. కానీ, ఆ పనులతోటి ప్రత్యక్ష సంబంధం మాత్రం లేదు. ఉత్తరీయం కప్పుకొని, అల్లాగే కళ్ళు మూసుకొన్నాను—

"ముష్టి కైతేమట్టుకు వేళాపాళా లేదా ఏమిటి? ఎప్పుడుబడితే అప్పు

దేనా ?—వెళ్లు. చెప్పేది నీక్కాదూ ? కదలవేం?...అందుకనిగాదూ భగవంతుడు మీ ముఖాన ఇట్లా రాసిపెట్టింది?''

ఈ కంఠస్వరం మా ఆవిడదని ఇట్టే గుర్తుపట్టాను. ఈ మాత్రం గాత్రమాధుర్యం వున్నవాళ్ళు ఆ వీధిలో నేలేరు. అందులో ఎనిమిదేళ్ళ నుండీ అలవాటైన కంఠస్వర మది. దాన్ని గుర్తు పట్టలేకపోవట మేమిటి ?

''అట్లా కోప్పడకండమ్మా! మేమూ ఒకప్పుడు—మీలాగా బాగా వున్నవాళ్లమే. ఇంటికొచ్చిన ముష్టివాళ్లను నేనూ ఇదేవిధంగా విదిలించి కొట్టాను. కానీ—నారాత యిట్లా అయింది...''

ఆ తర్వాత ఒకటి రెండు నిముషాలవరకూ నా కే విధమైన శబ్దమూ వినరాలేదు. ఆ రెండో గొంతు బహుశా బిచ్చగత్తెది గావొచ్చు. పోనీయ్! వెధవగొడవలు. లోకంలో లక్షలాదిదౌర్భాగ్యు లున్నారు. వాళ్లందరిని గురించీ ఆలోచించి బుర్ర పాడుచేసుకోవటం అనవసరం. నాబోటివాడు ఆలోచించదగ్గవాళ్లు, ఆలోచించవలసినవాళ్లు, తమ కేమాత్రము పట్టనట్టు తప్పించుకొంటున్నారు. కందకులేని దురద కత్తిపీట కెందుకు ?

''...మాకు పదెకరాల పొలంవుండేది''

నాకు నిద్ర పూర్తిగా తేలిపోయింది. ఈ ముష్టిదానిమూలంగా బంగారమంటి నిద్రను నీళ్ళొదులుకున్నాను. లేచి బైటికి గెంటుదామని పించింది. కానీ అలసిన శరీరం మంచాన్ని కరుచుకొని వదలనంటున్నది. మా ఆవిడ ఏం జేస్తున్నది? దాన్నోట్లో ఏ బెల్లపుగడ్డ కొట్టుకున్నది? ఆ ముష్టిముండను బైటికి తరమదేం? నేను నిద్రబోతున్నాననీ, కేకలు పెడితే, నానిద్రకు భంగమనీ మా ఆవిడకు ఎందుకుతోచదు? ఎందుకు తోచదో నాకు తోచలేదు. కానీ, ఈ ఆత్మకథతో నా మనశ్శాంతి మట్టిలో గలవ్వాల సిందేనా భగవాన్ !!

''...మా మామగారు పోతూపోతూ చాల బాకీలుచేశారు. ఎనిమి దెకరాలు అమ్మి ఆబాకీలు తీర్చాం. మిగతా రెండు ఎకరాలను స్వంతంగా చేసుకొంటున్నాం. మాది జమీందారీ గ్రామం. రైతులకు, జమీందార్లకు పార్టీలు పడయ్ తల్లీ! అవి కోర్టులదాకా వెళ్లినై: జమీందారు తనతొత్తుల చేత, ఊళ్ళో రైతుల వాములు తగులబెట్టించాడు. పంటలు నాశనం చేయించాడు. కొంపలు దోయించాడు. జమీందారుమనుషులకూ రైతులకూ కొట్లాట జరిగింది.

తరువాత ఆమె గొంతు వినిపించలేదు. మా ఆవిడ మాత్రం "ఇస్. ఏడవబోకమ్మా! కష్టాలు ఎవరికైనా వొస్తాయి. మహామహావాళ్ళకే అవి తప్పలేదు. సీతామహాదేవి లంకలో చెరవుండలా? చంద్రమతి కూటికీ, గుడ్డకూ మొఖంవాచి దాసీ పని చెయ్యలా? భగవంతుడు కొందరి కొందరినొష్ట అట్లా రాసిపెట్టి వుంచుతాడు— ఏడవబోకమ్మా!! చీకటే ఎల్లకాలం వుండదు. కొంతకాలానికైనా వెలుతు రొస్తుంది—" అని మా ఆవిడ ఓదార్పుమాటలు వినిపించినై. దీన్నిబట్టి ఆవిడ ఏడుస్తున్నదని గ్రహించాను.

"...ఆ కొట్లాటలో మావారు చనిపొయ్యారు... నేను దిక్కులేని దాన్నయ్యాను. మా పుట్టింటికి బయలుదేరాను ఇంటికి తాళంపెట్టి...... అప్పటికీ జాగ్రత్తగానే పడుకొన్నాను తల్లీ! ఎప్పుడు, ఎక్కడ ఎవరు కాజేశారో, నా తలకిింద మూట లేదు ఉదయం చూసుకొనేసరికి. పాలిక రూపాయల డబ్బూ, అన్నమూ, టిక్కెటు అన్నీ అందులోనే వున్నాయి తల్లీ! పాపిష్టిముండను, టిక్కెట్టునైనా, ఇవతల వుంచుకొన్నాను గాదు. చెకింగు చేసే ఆయన దించేశాడు. ప్రొద్దున్నుంచీ బిడ్డ "అన్నం—అన్నం" అని ఏడుస్తున్నాడు. ఒక్క తల్లికీ కనికరం కలగలేదు— నేను ఒకళ్ళకు ఇంతపెట్టిన దాన్నేగాని "దేహీ" అని అడిగినదాన్ని గాదు. ఇంతకాలానికి ఇటువంటి స్థితి వొచ్చింది—

నేను పూర్తిగా చికాకైపోయాను. జీవితాలు రోజురోజుకూ శిథిలమవుతున్నాయి. కొత్త చిగుళ్ళతో నవనవలాడవలసిన బ్రతుకులు విధుర భూమిక లవుతున్నాయి. ఏమూల విన్నా దరిద్రుల ఘోషలు, ఆకలికేకలు అనాథుల ఆర్తరవాలు. వీటికి అంతంఎప్పుడు? జనావళిముఖాలపై చిరునవ్వు మెరిసే దెప్పటికి? మంచంమీదినుండి లేచాను. ఒళ్ళు విరుచుకొన్నాను. బద్ధకంగా వాకిట్లోకి వొచ్చాను. అప్పుడే మా ఆవిడ బిచ్చమేసిందిగావును, ఆదుర దృష్టవంతురాలు, తలొంచుకుని జోలె సవరించుకొంటున్నది. ప్రక్కనే ఆమె కొడుకు పైటచెంగు బట్టుకొని నిలబడివున్నాడు. నా మెదడులో మెరుపు మెరిసినట్లయింది. కళ్ళు నులుముకొని మళ్ళీమళ్ళీ ఆ పిల్లవాడివేపు చూశాను. మెళ్ళో పాలపూసలదండ. మొలతాడులో రెండు చిల్లికానీలు. జుట్టు గుబురుగా రాగి వర్ణంలో పెరిగివుంది. నేను ఎంతకాదని సరిపెట్టుకొందామన్నా— పాపిష్టి హృదయం, ఈ కుర్రవాడు, పార్కులో అతనితో కనిపించిన కుర్రవాడేనని ఘోషించటం మానలేదు.